క్లుప్తంగా

గోసేవతో సమస్త సంపదలు

కౌతాళం: గోపోషణ, గోసంరక్షణ వల్ల సమస్త సంపదలు, ఆరోగ్యం సిద్ధిస్తుందని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూల్ జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వీర్లదిన్నె గ్రామం ఆంజనేయ స్వామి ఆలయంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ముగింపోత్సవాల సందర్భంగా గోపూజ, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించారు. భజన మండలి సభ్యులు దశరథరెడ్డి, అర్చకులు కృష్ణస్వామి, ఓకాంర్‌రెడ్డి, ఉసేని, ప్రహ్లాదరెడి పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

ఆదోనిఅర్బన్: ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రథమ చికిత్సపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రథమంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ గోపీనాథ్, ప్రసాదరావు వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, కోశాధికారి శంకరమ్మ, సభ్యులు వనపరాజు, మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

కౌతాళం: ఈరన్న స్వామి దేవాలయం వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ హెచ్.జి.వెంకటేశ్ అన్నారు. శ్రావణమాస ఉత్సవాల అనంతరం ఆలయ పరిసరాలను శుక్రవారం దేవాలయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. పరిసరాల్లోని వ్యాపార సముదాయాల వద్ద పెరుకుపోయిన చెత్తచెదారం తొలగించకపోవడంతో కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, సిబ్బంది కిరణ్, విజయ్‌కుమార్, వీరేష్ ఉన్నారు.

దళిత మహిళపై దాడి అమానుషం



పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మను స్తంభానికి కట్టి దాడి చేయడం అమానుషమని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవ సహాయం అన్నారు. దాడి ఘటనను నిరసిస్తూ కేవీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరునెలల క్రితం ఆమె కుమారుడు ఈరన్న బీసీ కులానికి చెందిన ఓ యువతిని వివాహం చేసుకున్నాడన్నారు. దీనిని జీర్ణించుకోలేక ఆ సామాజిక వర్గానికి చెందని కొందరు దాడి చేయడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సుమాల ఆంథోని, మనోహర్, రాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కౌతాళం: మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వ్యక్తితో పాటు ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌రిజ్వాన్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. మండల పరిధిలోని బంటకుంట వంక నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా కౌతాళం గ్రామ వెలుపల తమ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు చెప్పారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుకను తరలిస్తున్న గోతులదొడ్డి గ్రామానికి చెందిన పరమేష్‌పై కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లక్ష్మీదేవమ్మ

నందవరం: మండల పరిధిలోని ముగతి గ్రామం బునకుంట కాలనీ వాసుల 20 ఏళ్ల కల నెరవేరిందని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ అన్నారు. శుక్రవారం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆమె భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..కాలనీ వాసులు రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామంలో ఎంపీపీ నిధుల కింద రూ.10 లక్షలు, గ్రామ సర్పంచు నిధుల ద్వారా రూ.4 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు, అధికారులు సహకారించాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణపతి, వార్డు మెంబర్లు సద్దుల ఉసేని పీరా, నాగేష్, దాదా, చిన్న దౌలత్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉసేని, తారకరాముడు, రంగన్న, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

- కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల నిరసన



మాతా‌శిశు ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

ఆదోని టౌన్: ఏళ్లతరబడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తూ పేదలకు ఎన్నో రకాల సేవలు అందించాం. కరోనా సమయంలో తమ కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రజారోగ్యమే లక్ష్యంగా విధులు నిర్వర్తించాం. అయితే నేడు ప్రభుత్వం తమ సేవలను గుర్తించకపోవడమేగాకుండా తమ స్థానంలో మరొకరి నియామకం చేస్తామనడం ఏమిటని ప్రశ్నిస్తూ శుక్రవారం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు నిరసన తెలిపారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుపడుతూ ఆదోని మాతాశిశు ప్రభుత్వ ఆసుపత్రి గేటు ఎదుట అందోళన చేపట్టారు. సర్వజన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ముందు స్టాఫ్ నర్సులు నిరసన తెలిపారు. తమకు అండగా నిలువాల్సిన ప్రభుత్వం అన్యాయం చేస్తోందంటూ స్టాఫ్‌నర్సులు విశ్వ, అనిత, ప్రమీలరాణి ఆవేదన వ్యక్తం చేశారు. పదిహేనేళ్లుగా పేదలకు నిజాయితీగా తాము అందజేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించకపోవడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. కేవలం 18 నెలలు శిక్షణ పొందిన వారిని తమస్థానంలో నియమించడం ఎంతవరకు న్యాయమని స్టాఫ్ నర్సులు అనిత, పుష్ప, సరస్వతి, మజీద్‌అహ్మద్, బిందు, అరుణ, ప్రమీళరాణి తదితరులు ప్రశ్నించారు. ఏదాదిన్నర శిక్షన కూడా పూర్తవ్వని ఏఎన్ఎంలు స్టాఫ్ నర్సులుగా ఎలా సేవలు అందజేస్తారని నిలదీశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులు హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వండి



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ఆదోని టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. తమకు రావాల్సిన వేతనాలపై రాష్ట్ర ప్రభుత్వంలోని ఎమ్మెల్యే, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లు, జీసీహెచ్‌లు తదితర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఓఎస్, డీఎస్సీ, జీఎన్ఎంలు ఆందోళన వ్యక్తం చేశారు. సర్వజన ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో 60 మంది, చిన్నపిల్లల ప్రభుత్వ ఆసుపత్రిలో 12 మంది చొప్పున ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేతనాలు మంజూరు చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మల్లికార్జున, సుధాకర్, రవి కోరారు.

విద్యార్థుల ఆశలు అడియాసలయ్యాయి



నేను ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అధ్యాపకుడుగా విధులు నిర్వర్తిస్తున్నా. ఇటీవల జరిగిన నీట్ పరీక్షల్లో మా కూతురుకు 470 మార్కులు వచ్చాయి. అయినా సీటు రాలేదు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న మెడికల్ కళాశాలల ద్వారా సీట్లు పెరుగుతాయి. ఆ నమ్మకంతో మా అమ్మాయిని లాంగ్‌టర్మ్ కోచింగ్‌కు హైదరాబాద్‌కు పంపించా. ఈసారి తప్పకుండా సీటు దొరుకుతుందని ఆశించాం. అయితే ప్రస్తుత ప్రభుత్వ వైద్యరంగాన్ని ప్రైవేట్ పరంగా చేసేలా ఉంది. ఈ నిర్ణయం ఏ మాత్రం సమంజసం కాదు. పేదలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం మరోసారి పునరాలోచించాలి.

– జోనాథన్ వీక్లిఫ్ ఆదోని

జీఓ 115ను వెంటనే రద్దు చేయాలి



ప్రభుత్వాసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న నర్సులు

ఎమ్మిగనూరురూరల్: నర్సింగ్ వ్యవస్థకు నష్టం కలిగించే జీవో నెంబర్ 115ను వెంటనే రద్దు చేయాలని నర్సులు, స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ఏపీ నర్సింగ్ పోరాట సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో అందోళన చేపట్టారు. ప్లకార్డులు పట్టుకొని ప్రభుత్వాసుపత్రి నుంచి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులు నరసింహులు, వీరేష్, నాయక్, శశికళ, సుబ్బమ్మ, పుష్ప, మాధవి మాట్లాడుతూ జీవో 115పై ఇప్పటికే కోర్టులో పిటిషన్ వేసినట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో అందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సులు శోభ, జాహిదా, సుష్మ సుజాత, చంద్రకళ, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం

ఎమ్మిగనూరురూరల్: కలిసికట్టుగా బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక కుర్ని కళ్యాణ మండపంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ, జిల్లా సభ్యత్వశాఖ తొగట నరసింహులు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్‌జి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయిలో సభ్యత్వ నమోదు పెంచాలన్నారు. అప్పుడే పార్టీ బలోపేతమవుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ అంకాల రెడ్డి, రాయలసీమ జోన్ సభ్యత్వ ప్రముఖ సావిత్రి, జిల్లా ప్రముఖ మురళీనాయుడు, మంత్రాలయం కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

దళిత మహిళపై దాడి

- పది మందిపై కేసు నమోదు

పెద్దకడబూరు: దళిత మహిళపై దాడికి పాల్పడ్డ 10 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మ పెద్ద కుమారుడు ఈరన్న గత ఫిబ్రవరిలో అదే గ్రామానికి చెందిన చాకలి భూలక్ష్మి కూతురు నాగలక్ష్మిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇరువురి కుటుంబాల మధ్య మనస్పర్థలు ఉన్నందున ఈరన్న భార్యతో బెంగళూరు వెళ్లిపోగా గోవిందమ్మ చిన్న కుమారుడితో ఎమ్మిగనూరులో నివాసం ఉంటోంది. ఈ స్థితిలో గురువారం పని నిమిత్తం గోవిందమ్మ చిన్న కుమారుడితో కలిసి కల్లుకుంట గ్రామానికి వచ్చి ఉండగా రాత్రి 8 గంటల సమయంలో చాకలి నాగలక్ష్మి కుటుంబానికి చెందిన భూలక్ష్మి, నరసమ్మ, ఉసేనమ్మ, లక్ష్మి, రంగమ్మ, నాగరాజు, ఉసేని, రాముడు, భీమరాజు, గుండమ్మ వారిపై దాడిచేసి చాకలిగేరికి తీసుకొచ్చారు. కరెంటు స్తంభానికి కట్టేసి కొట్టి చంపుతామని బెదిరించినట్లు బాధితురాలు గోవిందమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

దళిత మహిళను స్తంభానికి కట్టేసి దాడిచేసిన నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు లక్ష్మినారాయణ, మీసుగ జయన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ మంజునాథ్, ఎస్ఐ నిరజంన్‌రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. కల్లుకుంట గ్రామంలో గురువారం రాత్రి దళిత మహిళ గోవిందమ్మపై బీసీలు దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. దళిత ప్రజా సంఘాల నాయకులు రామతీర్థం, అమరేష్, కదిరికోట బతుకమ్మ, మాల నరసప్ప, మాల మధుబాబు పాల్గొన్నారు.

కోసిగి: పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల కార్యదర్శి రామకోటి హనుమంతు డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు



వాలీబాల్‌లో తలపడుతున్న క్రీడాకారులు

కోసిగి: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆదేశాల మేరకు స్థానిక బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి సెలక్షన్ క్రీడా పోటీలు రెండవ రోజు శుక్రవారం కొనసాగాయి. బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ఖలీల్ అహ్మద్, క్రీడల మండల కో-ఆర్డినేటర్ పీడీ రాజారాం ఆధ్వర్యంలో అండర్-17, అండర్-14 కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్ పోటీలు నిర్వహించారు. మండలంలోని 11 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అండర్-17 , అండర్-14 ఖోఖో, వాలీబాల్, కబడ్డీలో బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారు. అండర్-17 ఖోఖో రన్నర్స్‌గా కందుకూరు, అండర్-14 ఖోఖోలో వందగల్లు రన్నర్స్‌గా నిలిచారు. కబడ్డీలో అండర్-17, అండర్-14 రన్నర్స్‌గా డి.బెళగల్ విద్యార్థులు, వాలీబాల్‌లో మౌంట్‌కార్మెల్ స్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. చెస్ పోటీల్లో పల్లెపాడు విద్యార్థులు ప్రథమ స్థానం, కోసిగి విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. గెలుపొందిన జట్లకు షీల్డులు అందజేశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడకారులను మండల జట్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కోసిగిలోనే ఈనెల 25వ తేదీన నియోజకవర్గ స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయులు రామచంద్ర, వెంకటేష్, శివ, మహేంద్రమ్మ, గంగాధర్, శేఖర్, బసవ తదితరులు పర్యవేక్షించారు.

నిమజ్జనోత్సవంలో అధికారుల సేవలు భేష్



సీఐను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

కౌతాళం: మండలంలో గణేష్ నిమజ్జన కార్యక్రమం జయప్రదం చేయడంలో అధికారుల పాత్ర ఎంతో ఉందని గణేష్ ఉత్సవ కమిటీ మండలాధ్యక్షుడు దాట్ల సుబ్బరాజు, గౌరవాధ్యక్షుడు మారుతీ మోహన్ అన్నారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో శుక్రవారం కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల మద్దతుతో నిమజ్జన కార్యక్రమం విజయవంతమైందన్నారు. నిమజ్జనోత్సవంలో మండల రెవెన్యూ, పోలీస్, విద్యుత్ అధికారులు పని చేసిన తీరు అభినందనీయమన్నారు. అందుకు గాను మండల అధికారులను సన్మానిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కౌతాళం సీఐ అశోక్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. ఉత్సవ కమిటీ సభ్యులు గురురాఘవేంద్ర రెడ్డి, రాఘున్న శెట్టి, సొంద్రి బసవరాజు, కురువ వీరేష్, చంద్రశేఖర్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ఈనెల 11వ తేదీన జరిగిన ఘర్షణకు సంబంధించి తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ విజయమోహన్‌రావు శుక్రవారం తెలిపారు. గణేష్ విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు మేము ముందు వెళ్లాలంటే... కాదు మేము అంటూ ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. అయితే పాత కక్ష్యలను దృష్టిలో పెట్టుకుని కల్లుబావికి చెందిన వీరేష్‌తో పాటు మరో ముగ్గురిపై తొమ్మిది మంది దాడి చేశారని తెలిపారు. దేవా, రాము, రాజు, గోపాల్, భీమ, హరి, జనార్దన్, ఈరన్నతోపాటు మరో వ్యక్తిపై బాధితుడు వీరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

కామ్రేడ్ సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

కోసిగి: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరికి మండల సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ఉద్యమాల బాటలో నడిచి అంచలంచెలుగా ఎదిగి తనదైన శైలిలో ముద్ర వేశారని కొనియాడారు. పార్లమెంట్‌లో రాజ్యసభ సభ్యుడిగా ప్రజల తరపున గొంతు వినిపించారన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: సీతారాం ఏచూరి మరణం సీపీఎం పార్టీకి తీరని లోటని డీవైఎఫ్ఐ నాయకులు ఉరుకుంద, గోవిందు అన్నారు. సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణించడంతో మండల పరిధిలోని నౌలేకల్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గోనెగండ్ల: సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మృతి వామపక్ష పార్టీలకు తీరనిలోటు అని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, యూటీఎఫ్ నాయకులు నరసింహులు, బాబు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం గోనెగండ్లలో కేవీపీఎస్, యూటీఎఫ్, ఆటో యూనియన్ నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏచూరి నిరంతరం ప్రజల పక్షాన, కార్మికులు, కష్టజీవుల పక్షాన నిలబడ్డారన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఈరన్న గౌడ్, నాగేష్, మారేష్, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

ఆదోని రూరల్: కమ్మరచేడు గ్రామ ప్రజలు 376 ఆహారపు కిట్లను విజయవాడ వరద బాధితుల కోసం వాహనాల్లో శుక్రవారం తరలించారు. కమ్మరచేడు శ్రీ ఆనందసాయి చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ కేపీ కంఠమూర్తి రూ.50 వేలు వరద బాధితుల సహాయార్థం చెక్కును అందించారు. ప్రతిఒక్కరూ మానవతా దృక్పథంతో విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

రైతులకు రాయితీ భోజనం ఏర్పాటు చేయాలి

ఆదోని అర్బన్: రాయలసీమలోనే అతిపెద్ద ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు వేరుశనగ దిగుబడులు అధికంగా వస్తున్నాయని, రైతులకు రాయితీ భోజనం అందించాలని వీరశైవ జంగమ హక్కుల పోరాట సమితి సభ్యులు కన్నె జగదీష్, గాజుల చంద్రశేఖర్, సిద్ధప్ప ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని రాయితీ భోజనం ఏర్పాటు చేయాలన్నారు. రోజుకు 20 వేల సంచులు పైనే వేరుశనగకాయలు, 2 వేల క్వింటాళ్ల పత్తి దిగుబడులు యార్డుకు వస్తున్నాయన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం రైతులకు భోజన సౌకర్యం కల్పించడం లేదన్నారు. అలాగే వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న గుమస్తాలు, కార్మికులకు కూడా రాయితీ భోజనం అందేవిధంగా చొరవ చూపాలన్నారు.

17న అనంత పద్మనాభ వ్రతం

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ ఆంజనేయ స్వామి సన్నిధిలో మంగళవారం అనంత పద్మనాభ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ మేనేజర్ కొప్రేష్ ఆచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంత్రాలయం మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థ మహాస్వాముల ఆదేశాల మేరకు అనంత పద్మనాభ చతుర్దశి సందర్భంగా వ్రతం చేస్తున్నామన్నారు. అదేరోజు మంగరాయ ఆంజనేయస్వామికి తేనాభిషేకం, ఫల పంచామృతాభిషేకం, ప్రత్యేక పూల అలంకరణ, మహామంగళహారతి తదితర విశేష పూజలు ఉంటాయన్నారు.

ఘనంగా హిందీ దివస్ వేడుకలు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఒక రోజు ముందుగా శుక్రవారం హిందీ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, హిందీ పండితులు హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. హిందీని అధికారిక భాషగా 1949లో ప్రభుత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్ పద్మావతి ఆధ్వర్యంలో హిందీ దివస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమాలలో ఉపాధ్యాయులు జాన్ విక్టర్, ప్రసాద్,లోక్యనాయక్, ప్రహ్లాద్ తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలోని మిల్టన్ గ్రామర్ పాఠశాలల్లో హిందీ దివస్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కరస్పాండెంట్ రమేష్ బాబు... గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిటైర్డ్ హిందీ పండిట్ చాంద్ బాషా, ప్రిన్సిపాల్ నాగరాజు హిందీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు మెహరున్నిసా, రంగస్వామి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.
- ఆదోని రూరల్: మండలంలోని పెద్దతుంబళం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో శుక్రవారం ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హెచ్ఎం వెంకటేష్, హిందీ ఉపాధ్యాయురాలు నయనకుమారి హిందీ భాష గొప్పతనాన్ని వివరించారు. హిందీలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్స్‌ను అందించారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



కడిమెట్ల మాసోత్సవంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ

ఎమ్మిగనూరురూరల్: గర్భిణిలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కడిమెట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఆకుకూరలు, పాలు, గుడ్లు, చిరుధాన్యాలు తీసుకుంటే తల్లి ఆరోగ్యంతో పాటు బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రతను తప్పక పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వేడి నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శైలజ, మౌలాబీ, మెహరున్‌బీ, వెంకటేశ్వరమ్మ, గ్రేసమ్మ, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి



ఏఓకు వినతి పత్రం ఇస్తున్న విద్యుత్ మీటర్ రీడర్ల సంఘు నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖలో పనిచేసే మీటర్ రీడర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీరేష్, నరసింహరెడ్డి డిమండ్ చేశారు. శుక్రవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సంఘ నాయకులు స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఓను కలిసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ఎన్నోఏళ్లుగా విద్యుత్ శాఖలో పనిచేసే మీటర్ రీడర్లకు సరైన వేతనాలు అందడం లేదన్నారు. కాంట్రాక్టర్ వేతనాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. అందువలన రాష్ట్ర ప్రభుత్వమే మీటర్ రీడర్లకు వేతనాలు అందించాలని కోరారు. గత నెలలోనే తిరుపతి విద్యుత్ సీఎండీ ద్వారా ఉత్తర్వులు వచ్చినా కాంట్రాక్టర్ ఇప్పటివరకు ఎస్కో అకౌంట్ ఓపెన్ చేయలేదన్నారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింలపై కేంద్రం కుట్ర

- వక్ఫ్ చట్ట సవరణకు ఒప్పుకోం
- ఎమ్మిగనూరులో ముస్లింల భారీ ర్యాలీ



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మత పెద్దలు, ప్రజా సంఘాల నాయకులు



ఎమ్మిగనూరులో వక్ఫ్ చట్ట సవరణ వ్యతిరేక ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

ఎమ్మిగనూరుటౌన్: భారత రాజ్యాంగం ముస్లిం మైనారిటీలకు కల్పించిన హక్కులను హరించేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ముస్లిం మత పెద్దలు, ప్రజా సంఘాలు, కమ్యూనిస్టు పార్టీల నాయకులు మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో వక్ఫ్ చట్ట సవరణను తాము అంగీకరించమని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని జామియా మసీదు నుంచి ముస్లింలు వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. గాంధీ సర్కిల్, సోమప్ప సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లిం మత పెద్దలు, యుసుఫ్ మౌలానా, అతావుల్లామౌలానా, సీఫతుల్లా మౌలానా, జామీయా మసీదు కమిటీ చైర్మన్, కౌన్సిలర్ ఖాసీంబేగ్, మనియార్ వాహిద్, కౌన్సిలర్ వాహిద్, మల్లెల గ్రూప్స్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న మాట్లాడారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లింలకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందన్నారు. బోర్డ్‌లో అన్యమతస్తులను చోటు కల్పించడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలకు ముస్లింలంతా వ్యతిరేకమన్నారు. వక్ఫ్ బోర్డ్ ఆస్తులు ముస్లింలకే చెందుతాయని, వారే హక్కు దారులని అన్నారు. వక్ఫ్ చట్ట సవరణకై 40 ప్రతిపాదనలను పార్లమెంట్ జేపీసీకి పంపడం సమంజసం కాదని తెలిపారు. ముస్లింల అభ్యున్నతికే పూర్వీకులు వక్ఫ్‌బోర్డు పరిధిలోకి ఆస్తులను చేర్చారన్నారు. దీనిపై చట్ట సవరణ చేసేందుకు పూనుకొంటే ఊరుకోబోమని హెచ్చరించారు. అనంతరం డిమాండ్ల వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.